# ఎన్నికలపై ప్రత్యేక నిఘా

## ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారుల కసరత్తు

అబిడ్స్, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో అధికారులు గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ వ్యూహం పన్నుతున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. విక్టర్ అధికారులతో సమీక్ష జరుపుతూ నిఘాను ముమ్మరం చేయిస్తున్నారు. నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరుగకుండా ఉండేందుకు గాను ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీం, వీడియో సర్వేలెన్స్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంల ఏర్పాటుతో పాటు నోడల్ అధికారి గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ప్రచారానికి అవసరమైన అనుమతుల మంజూరు, ఎన్నికల నిబంధనలను అమలు చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన బృందాలు ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వహిస్తున్నాయి. మద్యం, డబ్బు రవాణా, పంపకాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘాను మరింత ముమ్మరం చేస్తున్నారు.



జీహెచ్ఎంసీ భవనం, అబిడ్స్

ముఖ్యంగా నియోజకవర్గం స్టాటిక్ సర్వేలెన్స్ బృందం తనిఖీల్లో పెద్ద మొత్తం నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా ఉండేందుకు 24X7 కంట్రోల్‌రూం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు, అనుమతులు, ర్యాలీలు, బహిరంగ సభల విషయంలో ఏ విధమైన సందేహాలు ఉన్నా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. సెక్టోరల్ మెజిస్ట్రేట్‌ల నియామకం కూడా పూర్తయ్యింది.

### ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు..

నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉంటున్నాయి. ఎక్కడ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు గుర్తించినా అధికారులు అక్కడకి వెళ్లి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తారు. ఎక్కడ కోడ్ ఉల్లంఘన జరిగినా సంబంధిత పరిధిలోని బృందాలకు సమాచారం అందుతుంది. వెంటనే బృందాలు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తారు.

### స్టాటిక్ సర్వేలెన్స్ టీం ..

స్టాటిక్ సర్వేలెన్స్ టీం ప్రతి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు ముమ్మరం అవుతున్నాయి. వీరితో పాటు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న కోట్ల వెంకట్‌రెడ్డి నేతృత్వంలో వివిధ ప్రాంతాలలో తనిఖీలు జరుగుతున్నాయి. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు జరగకుండా వీడియో సర్వేలెన్స్ టీంలు నిఘా ఏర్పాటు చేస్తున్నాయి.

### నిరంతర నిఘా నేత్రం..

అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలపై వీడియో సర్వేలెన్స్ బృందాలతో నిఘా కొనసాగుతోంది. రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగినా ఈ బృందాలు వీడియో చిత్రీకరించి ఎన్నికల కమిషన్‌ను అందిస్తుంది. సభలు, సమావేశాలు, ర్యాలీల్లో ఎంతమంది ఉన్నారు. ఎన్ని వాహనాలు ఉన్నాయి. వాటిలో ద్విచక్ర వాహనాలు ఎన్ని,కార్లు, బస్సులు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉన్నాయో వాటి నంబర్లతో సహా ఈ బృందాలు వీడియో చిత్రీకరిస్తాయి.



కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల ఎంఐఎం ఎమ్మెల్యేల అభ్యర్థుల తరపున ఆదివారం ప్రచారం చేస్తున్న ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కారును పోలీసులు తనిఖీలు చేశారు. ఎన్నికల సందర్భంగా సాధారణ తనిఖీల్లో భాగంగానే ఎంపీ వాహనాన్ని తనిఖీ చేసినట్లు పోలీసులు తెలిపారు. - మెహిదీపట్నం, నవంబర్ 5

# అబిడ్స్ పోలీసుల ఫ్లాగ్‌మార్చ్




అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పోలీస్ బలగాలతో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ పోలీసులు నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో డీసీపీ వెంకటేశ్వర్లు, అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ చంద్ర శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

- అబిడ్స్, నవంబర్ 5

# మహిళా సాధికారతే లక్ష్యం



మహిళా సాధికారతే లక్ష్యంగా జై మహాభారత్ పార్టీ పనిచేస్తుందని, జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలనే ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిలబెడుతున్నామని జై మహాభారత్ జాతీయ అధ్యక్షుడు శ్రీ భవవాన్ శ్రీ అనంతవిష్ణు (ప్రభు) తెలిపారు.ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని.. ప్రకటించిన ఎమ్మెల్యే టిక్కెట్లలో పూర్తిగా మహిళలకే కేటాయించామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడించడమే లక్ష్యంగా తమ పార్టీ ముందుకు పోతుందని తెలిపారు. ఎల్‌బీనగర్ అభ్యర్థిగా నాగమణిని ప్రకటించారు.

- రవీంద్రభారతి, నవంబర్ 5

# 12వ స్నాతకోత్సవం



ఏఐఏడీ( ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ డెంటిస్టీ) సొసైటీ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని చంపాపేట్‌లోని సామ సరస్వతి కన్వెన్షన్ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన 300 మంది దంత వైద్యులను ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణ మోహన్ రావు, ఐడీఏ ప్రెసిడెంట్ డాక్టర్,జ్వాలా చైతన్య, డాక్టర్ పరదేశి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కొఠావర్ దంత వైద్యులకు సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు క్లినికల్ నైపుణ్యాలను వివరించారు. - అబిడ్స్, నవంబర్ 5

# జైలుకెళ్లి వచ్చాడు.. పంథా మార్చాడు

**● టాబ్లెట్స్ అమ్ముతూ పోలీసులకు చిక్కాడు**

మెహిదీపట్నం, నవంబర్ 5 : జేబులు కొడుతూ పోలీసులకు పట్టుబడి జైలు కెళ్లి వచ్చాడు. మత్తు కలిగించే టాబ్లెట్లు అమ్మి డబ్బులు సంపాదించాలన్న ఆశతో కర్నాటక నుంచి టాబ్లెట్లను అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న హబీబ్‌నగర్ పోలీసులు ఆదివారం సాయంత్రం అతడి ఇంటిపై దాడి చేసి టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి అఫ్జల్‌సాగర్‌లో నివసించే నాడె చక్రధారి జేబులు కొట్టేస్తూ రెండు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. గోపాలపురం, శంషాబాద్ ఆర్‌జీఐఏ పీఎస్ నుంచి జైలుకు వెళ్లాడు. నిట్రావెట్ 10ఎంజీ టాబ్లెట్లను అమ్ముతున్నాడు. వాటితో వేరే టాబ్లెట్లు ,సిరప్‌లను తన సోదరి నైనాతో కలిసి అమ్ముతున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఆదివారం సాయంత్రం అతడి ఇంటిపై హబీబ్‌నగర్ పోలీసులు దాడి చేశారు. అతడి వద్ద 3420 నిట్రావెట్ 10 ఎంజీ టాబ్లెట్లు దొరికాయి. వీటితో పాటు రూ.16,780 నగదు,ఓ వీవో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడి సోదరి పరారీలో ఉన్నది.అతడిని విచారించగా కులబుర్గి(గుల్బార్గా) నుంచి తెచ్చి ఇక్కడ అవసరం ఉన్న వారికి అమ్ముతున్నట్లు చెప్పాడు. కేసును ఇన్‌స్పెక్టర్ రాంబాబు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యేపై కేసు నమోదు

చార్మినార్, నవంబర్ 5 : అనుమతులు లేకుండా ఎన్నికల ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మొఘల్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై రంగనాయకులు కథనం ప్రకారం.. చార్మినార్ నియోజకవర్గం స్థానిక ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తోపాటు అతడి కుమారుడు డాక్టర్ ఇంతియాస్ ఖాన్ ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వాల్టా హోటల్ క్రాస్ రోడ్డు నుంచి బీబీ బజార్ క్రాస్ రోడ్డు వరకు 200 మంది మద్దతుదారులతో ర్యాలీ నిర్వాహించారు. ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీ చేపట్టడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేతో పాటు అతడి కుమారుడు డాక్టర్ ఇంతియాస్‌పై కేసులు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

# డబ్బులు ఇవ్వాలని డిమాండ్.. ఇద్దరిపై కేసు

చార్మినార్, నవంబర్ 5 : ఇక్కడ ఇల్లు నిర్మాణం చేపట్టాలంటే మాకు అందాల్సిన తాయిలాల తర్వాతే ఏదైనా చేయాలంటూ.. ఓ వ్యక్తిని బెదిరింపులకు పాల్పడుతున్న ఘటన చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పీఎస్ పరిధిలోని ఖాజీపురకు చెందిన ముఖీద్ చౌదరి తన ఇంటి నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. అతినికి సమీపంలోనే నివసించే గులాం ఖాదర్ జిలానీ అలియాస్ మున్నా, అహ్మద్ ఖాన్ ఇంతియాస్ ఇద్దరు ముఖీద్ చౌదరిని పలు విధాలుగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఇంటి నిర్మాణం చేస్తే రూ.12 లక్షలు చెల్లించాల్సిందే, లేదంటే ఎలా నిర్మాణం చేపడతావో చూస్తాం అంటూ హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు నిందితులు సోషల్ మీడియాలో అసభ్య పదజాలాన్ని వినియోగిస్తూ ఇబ్బందులకు గురి చేశారు. దీనిపై సమాచారం తెలుసుకున్న చార్మినార్ పోలీసులు సుమోటో కింద కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



బంజారా కులస్తులు రాజ్యాంధికారమే లక్ష్యంగా పని చేయాలని సేవాలాల్ సేనా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాంబాబు అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, వైస్ ప్రెసిడెంట్ వి.రేఖ్యానాయక్, పరుశురాం, వి.లక్ష్మణ్ నాయక్, మోహన్ పాల్గొన్నారు. రాంబాబు మాట్లాడుతూ.. సేవాలాల్ సేనా సంఘం ఏ పార్టీకి వ్యతిరేక కాదని, ఎన్నికల్లో సేవాలాల్ సేనా సంఘం తరుపున తమ అభ్యర్థులను నిలబెడుతున్నామన్నారు. 17 మంది అభ్యర్థులను ప్రకటించి, నలుగురికి బీ ఫాంలను అందజేశారు. - రవీంద్రభారతి, నవంబర్ 5

# ముగిసిన యువ రచయిత్రుల సమ్మేళనం



యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న రచయిత్రులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 5. తెలుగు భాషా సాహిత్యాల వికాసమే ధ్యేయంగా తెలంగాణ సారస్వత పరిషత్తు అన్ని భావాలకు వేదికగా నిలుస్తుందని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జరుగుతున్న యువ రచయిత్రుల సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆచార్య శివారెడ్డి ప్రసంగిస్తూ సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించేలా యువ రచయితల కృషి కొనసాగించాలని సూచించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ తెలంగాణలో ప్రతిభ కలిగిన రచయిత్రులు, రచయితలు గొప్ప సాహితీమూర్తులుగా తయారుచేసేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీతలు మెర్సీమార్గరేట్, మానస ఎండ్లూరి ఆజాదీకామృత్ మహోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీలో తెలంగాణ నుంచి హైదరాబాద్ చరిత్ర గ్రంథానికి బహుమతి పొందిన సుకన్య భువనగిరి, ఇటీవల కాలంలో అద్భుత రచనలు ప్రచురించి యువ సాహితీవిమర్శకుల ప్రశంసలు అందుకున్న యువ రచయిత్రులు, కవయిత్రులు లహరి, రక్షిత సుమ, స్ఫూర్తి కందివనం, పల్లె దీక్షితగౌడ్, రాగలీన, సోని కట్ట్యూరి, పాలపర్తి హవీలా, శ్రీనిధి విష్ణవశ్రీలు పాల్గొని తమ భవిష్యత్తు రచనా ప్రణాళికలను సాహితీవేత్తలతో పంచుకున్నారు.